ప్రేమసుధ

(కవితా సంకలనం)

రచన :

పింగళి పాండురంగరావు

ప్రచురణ :

సాహితీ మంజరి

ఒంగోలు.

❄ ప్రేమసుధ
(కవితలు)

❄ ప్రథమ ముద్రణ :
మే - 1998

❄ వెల :
రు. 35/-

❄ ముద్రణ :
విజయ ఆఫ్‌సెట్ ప్రింటర్స్,
ట్రంకురోడ్, ఒంగోలు.

❄ ప్రతులకు :
"కృపానిధి"
8-71, లాయరు పేట
ఒంగోలు - 523 002.

భగవాన్ !

"భగవాన్! నాదేశం మట్టి, నీరు, గాలీ
ఫలాలు - తేనె లూరనీ!

ఇళ్ళూ, వాకిళ్ళూ, అడవులు, పొలాలూ
సిరులు తూగనీ!

మాటలూ, చేతలూ, ఆశలూ, బాసలూ
నిజాలతో నిండనీ!

నా దేశ జనుల హృదయాలు
ఒక్కటై వెలగనీ!

వారందరి బతుకులు
ఒక్కటై పండనీ!

- విశ్వకవి టాగోర్

సాహితీ మంజరి
ఒంగోలు

వ్యవస్థాపకులు : శ్రీమతి ఆర్. మాధవీలత
కార్యనిర్వాహకాధ్యక్షులు : పి. పాండురంగరావు

ప్రచురణలు :

1. నీరాజనం (గేయసంపుటి)
   - పింగళి పాండురంగరావు

2. మహాభినిష్క్రమణం (ఇందిరాగాంధీ సంస్మరణ కవితా సంపుటి)
   కూర్పు : పింగళి పాండురంగరావు

3. స్మృతి సుధ (కవితా సంపుటి)
   - పింగళి పాండురంగరావు

4. బైరాగి కవితాశోధ (సమీక్షా వ్యాసాలు)
   సంపాదకలు : పింగళి పాండురంగరావు

5. నిష్కృతి (కవితలు)
   - పింగళి పాండురంగరావు

6. శరసంధానం (కవితలు)
   - పైడిశ్రీ

7. గోరుముద్దలు (బాలవిజ్ఞాన కవితలు)
   - శ్రీ రావెల సాంబశివరావు

8. సాంధ్యవేళ (కవితలు)
   - పింగళి పాండురంగరావు

9. విప్లవ భాషా విధాత – శేషేంద్రశర్మ రచనలపై సమీక్షా వ్యాసాలు

కృతజ్ఞతలు

'ప్రేమసుధ' సాహితీ మంజరి పదవ ప్రచురణ కావడం ఆనందంగా వుంది.

'సాంధ్యవేళ' తర్వాత నేను వ్రాసి, వివిధ దిన,వార పత్రికల్లో ప్రచురింపబడ్డ కవితల్ని 'ప్రేమసుధ'గా రూపుకట్టాను.

ఈ పుస్తకానికి తమ 'అభినందన' పంపిన మహాకవి, పద్మశ్రీ, జ్ఞానపీఠ్, అవార్డు గ్రహీత **డా॥ సి.నారాయణ రెడ్డి గార్కి** నా హార్ధిక వందనములు.

నా ఆ బాల్య మిత్రులు, కవిశ్రేష్టులు **డా॥ నాగభైరవ కోటేశ్వరరావు** నన్ను ప్రోత్సాహిస్తూ "మనిషి తనం మీద నమ్మకంతో ...." పంపినందుకు వారికీ నా సప్రేమ నమస్సులు.

నా హితైషి, ప్రముఖసాహితివేత్త, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ గారైన ప్రొఫెసర్ **కొలకలూరి ఇనాక్** గారు ప్రేమతో పంపిన వారిసందేశానికి కృతజ్ఞతాపూర్వక వందనములు.

ఆప్తులు, సాహితీ ప్రముఖులు, నాగార్జున యునివర్సిటి రిజిష్ట్రార్ గారైన **శ్రీ రావెల సాంబశివరావు** గారు పంపిన 'సుధామాధురి' అందుకొన్నందుకు వారికి నమస్కారములు.

అలాగే సాహితీమిత్రులు **డా॥పి. నాగమల్లీశ్వరీ రావు** గారు 'ప్రేమసుధా' స్వాదనం' పంపినందుకు వారికి కృతజ్ఞతలు, అభినందనలు.

నా అభిలాష మన్నించి, 'ప్రేమసుధా' స్వీకర్తలైనందుకు పూజ్య పాదులు నా మేనమామలు **శ్రీ ఇలపావులూరి కామేశ్వరరావు** గార్కి **డా॥ ఇలపావులూరి పాండురంగరావు** గారికి నమస్సుమాంజలి.

ఈ పుస్తకాన్ని అందంగా అచ్చువేసి ఇచ్చిన 'విజయ గ్రాఫిక్స్' అధినేత **శ్రీ యన్. సుబ్బారావు** గార్కి కృతజ్ఞతలు

✆ : 592762

Andhra Saraswatha Parishath

TILAK ROAD, HYDERABAD - 500 001

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్, హైదరాబాదు - 500 001

President :
Jnanapeeth Awardee, Padma Bhushan
Dr.C.Narayana Reddy, MP
M.A.,Ph.D.,D.Litt.

అధ్యక్షులు
జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్
డా॥ సి. నారాయణ రెడ్డి, ఎం.పి.,
ఎం.ఏ.,పిహెచ్.డి.,డి.లిట్.,

అభినందన

ప్రేమించడమనేది గొప్ప మానవీయ లక్షణం. అది వ్యక్తిగతమైనది కావచ్చు విశ్వహితమైనది కావచ్చు. శ్రీ పాండురంగరావు గారి " ప్రేమ సుధ " లో ఉభయకోణాలు అగుపిస్తున్నాయి.

భావమాధుర్యంతో పాటు పద తారళ్యం శ్రీ పాండురంగరావు గారి రచనలోని జీవగుణాలు. ఈ సంపుటిలో కొన్ని మాత్రాచ్ఛందో గంధమున్న గీతాలున్నాయి. మరికొన్ని వచన సన్నిహిత పంక్తులూ వున్నాయి. సుప్రసన్న శైలిలో ఉదాత్తభావాలను కవితల రూపంలో అందిస్తున్న శ్రీ పింగళి పాండురంగరావు గారికి నా హార్దికాభినందన.

సి.నా.రె.

SRI VENKATESWARA UNIVERSITY

Prof. **K. ENOCH**, Ph.d.,
VICE - CHANCELLOR

Grams: "UNIVERSITY"
Phone : Off: 27727, 50666 Extn.212
Res : 27047, 50666 Extn. 221
Fax : 91-8574-29111 (O)
91-8574-29101 (R)
E= mail = vgc @ svni.ren.nic.in
TIRUPATI - 517502
Andhra Pradesh, INDIA.

Date : 16 JUNE ' 98.

Dear Sri Panduranga Rao Garu.

I have received your book "PREMA SUDHA" and enjoyed the same very well.

Thank you very much for sending me the same and I pray the Lord of Seven Hills to bless you with enough strength and time to bringout some more books with your pen.

With regards,

Yours Sincerely,

KOLAKALURI ENOCH

ఆం. ప్ర. ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక పురస్కార గ్రహీత
డా॥ పి. నాగమల్లీశ్వరరావు, ఎమ్.ఏ., పి.హెచ్.డి.,

'ప్రేమ సుధా' స్వాదనం

అది ఆదివారం. ఆరవ నెలలో అది ఆదివారం, అది మధ్యాహ్నం.

అయినా, "చాంద్ర తప సీమల్లో" విహరించే ఆ "ప్రేమ సుధా" కరుడు - సూర్యాతపంలో తపిస్తూ (కాదు, విహరిస్తూ) వచ్చాడంటే (పుస్తకం పై అభిప్రాయం కోసం) ఆయన బాలుడు కాదా మరి !

"సలవ రేతిరి" సెలిగాలి తగిలి, సలిగాలినీ, పొగమంచునూ వెలివేసి, "సంకురాతిరి సిలక" తో విహరించే ('విరహిం'చే) ఆ 'ప్రేమ సుధా' కరుడు యువకుడు కాదా మరి !

కవితా కన్యకు 'నీరాజన' మిచ్చి, కవితా వధూగృహప్రవేశం చేయించి, సరసంగా సాహచర్యం సాగించి, కవితా 'సాంధ్యవేళ'కు చేరుకొని, ఇప్పుడు 'ప్రేమ సుధా' కథ చెప్తున్నారంటే ఆయన వృద్ధుడు కాదా మరి!

సరే! ఆ బాల యువ వృద్ధుడు ఆ ఆదివారపు ఆదిత్యాతపంలో అంత ఆప్యాయంగా ఆ ప్రేమ సుధను అందించవచ్చారంటే - అందులో ఏదో "పునరుక్తి" ధ్వనిస్తోంది! ఇవ్వేళ ఇలా కొత్తగా "ప్రేమ సుధ" ను అందించడమేమిటి? ఈ "ప్రేమ సుధా" కరుని పరిచయ భాగ్యం కలి గాక ఇప్పటికి ఇరవై మార్లు చెట్లు చిగిర్చాయి కదా! ఉద్యోగ ప్రారంభ విభావరి లోకి ప్రవేశించగనే-ఆ ప్రదోషవేళలోనే ఆయన ప్రేమ సుధాకరుడు. అల అలనాటినుంచి 'ప్రేమ సుధ'ను అవ్వారిగా అందించే ఆ సుధాకరుడు - ఈనాడు ఇలా ప్రత్యేకంగా 'ప్రేమ సుధ' నందించడం 'పునరుక్తి' కాక మరేమిటి?!

అలాంటి ఆ ప్రేమ 'సుధాకరుడు' రాహుగ్రస్తుడు కాక, కవితా బాహు గ్రస్తుడై , ఇతోధికంగా సహృదయులందరికీ పరిపూర్ణ సుధారసం పద్య చషకాల్లో పదిలంగా అందించాలని ఆకాంక్షించే-

ప్రేమ సుధాకర సుధాస్వాది

నాగమల్లీశ్వరరావు....

కృతి స్వీకర్తలు - జీవిత విశేషాలు

సంగీత తపస్వి - గాన కళాకోవిదులు

శ్రీ ఇలపావులూరి కామేశ్వరరావు గారు

జననం : 15-4-1926
ఇలపావులూరు గ్రామం
ప్రకాశం జిల్లా

ఆంధ్రోపన్యాసకులు

AIR గాయకులు

సంగీతోపన్యాసకులు

Emeritus Fellow (Literary and performing Arts) Govt. of India.

రచనలు: త్యాగయ్య (తెలుగు విశ్వవిద్యాలయం)
రంగనాయక శతకము
మాతృ భాషా బోధనము
శరణం అయ్యప్ప శతకము
త్యాగరాజ పంచరత్న కీర్తనలు - వాఖ్యానం

విశేష కృషి: గత ఐదు దశాబ్దములకు మించి సంగీత సాధనలో అత్యున్నత శిఖరాల్నధిరోహించారు. శ్రీ త్యాగరాజ కీర్తనల విలక్షణ లక్షణాలను పరిశోధించిన సంగీత తపస్వి, సులలితమైన గానము వీరికి వెన్నతో పెట్టిన విద్య. అసంఖ్యాకమైన గాన కచేరీలలోను, సంగీతోపన్యాసములలోను తన గాన మాధుర్యాన్ని ప్రస్ఫుటించిన గాన కళాకోవిదులు, రాగపరమైన రక్తిని, భావపరమైన గరిమను హృద్యంగా వివరించగల సాహితీ సమారాధకులు. ఉపనిషత్తులలో, కావ్యాల్లో వీరికున్న పరిజ్ఞానం వీరిధిషణకు నిదర్శనం.

శ్రీ త్యాగరాజ స్వామి 'పంచకీర్తనలు' సంగీత ప్రపంచంలో ప్రసిద్ధి గాంచాయి. ఈ కీర్తనల వైశిష్ట్యాన్ని సంగీత పరంగాను, సాహిత్యపరంగాను సమగ్రంగా వ్యాఖ్యానించి అశేష ఆంధ్ర జనావళికి వివరించారు. అనర్గళమైన వాణితో, అనితర సాధ్యమైన బాణితో సంగీతాభిమానుల్ని పరవశింపచేస్తున్న ప్రజ్ఞాధురీణులు. సంగీత క్షేత్రంలో సుమధురఫలాల్ని పండిస్తున్న ఈ నిత్య కృషీవలుని జీవితం ధన్యం.

I. KAMESWARA RAO, M.A., B.Ed.,
Rtd. Lecturer in Telugu
Emeritus Fellow (Govt. of India)
Literary and performing Arts.

"Sri Kamakshi Nilayam"
27/366, Gayathri Nagar
NELLORE - 524 004 (A.P.)

ఆశీర్వాదం

ప్రియ భాగినేయులు చిరంజీవులు పింగళి పాండు రంగా రావుకు

ఆశీస్సులు

నీవు పంపిన కవితాసంపుటి 'ప్రేమ సుధ' ఆమూలాగ్రం చదివి ఆనందించాను. ఇది 'స్వర్ణ భారతి' సంవత్సరంగానే నా చూపు తొలుత 'స్వర్ణ భారతి' ఖండిక పైకి ప్రాకినది. అందలి నీ దేశభక్తి, తాత్కాలిక దేశస్థితి పై ఆందోళన, స్పందన, నన్నాకట్టుకొన్నవి. 'దివ్యారామం' లోని నీ ముముక్షుత్వం హర్షదాయకమే.

'కృపాభిక్ష' లో ఉషోదయం కోసం తపన భావగర్భితం. "నానీ, నానీ, నాదో మాట" లో శైశవ దశలోని ఆనందలోకం కళ్ళకుగట్టినట్టున్నది. ఇలాగే 'శుభచైత్రం', 'జేజేలర్రా', 'నవ్యసృష్టి', 'వివేకానికి నాంది' మొదలైన రచనలన్నీ వైవిధ్యంతో భావుకతతో ధారాశుద్ధి కలిగి పాఠకులను ఆమూలాగ్రం ఒకే గుక్కలో చదివించేవిగా వున్నాయి.

ఇలాంటి కవితాసంపుటిని లోకానికందిస్తున్నందుకు మనసారా నిన్నభినందిస్తున్నాను. పైగా దీనిని మేనమామలకు మాకంకితమిస్తున్నందుకు మిక్కిలి హర్షిస్తున్నాను. నీ కోరిక మేరకు ఈ కృతిని స్వీకరిస్తూ నీకు నా సప్రేమాశీస్సులు అందజేస్తున్నాను.

ఇట్లు
మేనమామ
ఇలపావులూరి కామేశ్వరరావు

Dr. I. Panduranga Rao

Phone : 5540485

H-4/71, Mahavir Enclave
Palam - Dabri Road,
New Delhi - 110045

చిరంజీవి పింగళి పాండురంగారావుకు

సుస్నిగ్ధ శుభాశీస్సులు. నీవు పంపిన 'ప్రేమసుధ' అందింది. ఆస్వాద్యంగా ఉంది. చందన చర్చిత చాలీసా లాగా ఇందులోని 40 ఖండికలు కండచక్కెరలాగా కమ్మగా ఇంపుగా సొంపుగా ఉన్నాయి. తన ఆత్మ ఎటూ కనిపించదు కదా అని కనీసం తన హృదయాన్నయినా చూచుకొని ఆనందిద్దామని కావ్య భారతి ఆర్తితో తన అంతరంగాన్ని వెదుక్కుంటున్నయీ రోజుల్లో ఈ పాండు రంగాంతరంగిణి ప్రేమసుధను అందించటం చాలా ఆనందించవలసిన విషయం. ప్రేమ స్వరూపుడయిన ప్రభువు మన అందరి యెదల్లో నిరంతరం నివసించే ఉంటాడు. కనుక మన పర్యంకం ఎన్నటికీ వృథా కాదు. వ్యథ ఉన్నంతరవరకు సుధ ప్రవహిస్తూనే ఉంటుంది. మీ విపత్తులే మా శ్రీనిధి అని ప్రభువుకు నివేదించుకున్న కుంతీ వాక్యాలు ఈ నాటికి సుధానిధిని పంచిపెడుతున్నాయి. అలాగే నీ ప్రేమసుధ కూడా చిరంతన చైతన్య వాహిని కావాలని కోరుకుంటున్నాను.

ఈ కృతిని మాకు సమర్పించవలెననే భావం స్పృహణీయం. ఆత్మీయతతో స్వీకరిస్తున్నాను.

మీ

పాండు మామయ్య

ఇందులోని కవితలు

ప్రేమసుధ

ప్రభూ!
ఈ మొగ్గల్ని
ప్రసూనాలుగా మార్చడం
నీకే సాధ్యం
ప్రేమ పరిమళంతో నింపడం
అన్యుల కసాధ్యం
అందుకేనేమో
మేము ఏం చేసినా
ఈ మొగ్గలు వికసించడం లేదు
ఎంత వేచి చూస్తున్నా
ఏ మాత్రం పరిమళించడం లేదు

మా మలిన స్పర్శల్లో
రేకులు విప్పారకనే
మొగ్గలుగానే రాలిపోతున్నాయ్
పరిమళించకుండానే
ధూళిలో కలిసిపోతున్నాయ్

కాని - నాకు తెలుసు
నీ కృపా వీక్షణంలో
ఈ జీవన ప్రసూనాలు
రెక్కలు తొడుగుకుంటాయని
నీ మధుర స్పర్శాలేశంతో
కుట్మలాలు రాగరంజిత మౌతాయని

అందుకే - ప్రభూ!
నా ఎదలో నువ్వాసీనుడ వయ్యే వరకు
నీ కళ్ళల్లోకి నేనొరిగి పోయే వరకు
ఈ వృధా పర్యంకం పైనే పరుండనీ
నే ప్రేమ సుధకై వేచి చూడనీ!!!

ఆంధ్రజ్యోతి దినపత్రిక 25-12-86

కాంతికే దారం

ఈ నీరవ నిశీధాంబర ప్రాంగణాన
ముత్యాల ముగ్గులై విలసిల్లు
ఓ రమ్యతార కల్హారా!

మీ ముగ్ధ మోహన రూప విలాసాల
నిక్కంపు వెల కూర్చగల
ఆ గడుసరి బేహారి ఎక్కడ?

మీసుషమాలావణ్య సుమాల్ని
నానయనాభ్యంతర సీమలనింపే
ఆకవితాకామిని ఎక్కడ?

మీ నిత్యనూతన శోభలు
మీ అగణిత దివ్య స్ఫూర్తులు
నా హృది నిండకనే
కనురెప్పైనా వాల్చలేను!

రేఖా మాత్రపు మీ కాంతిసలిలం
ఈ జీవితపుటెడారిని
సుకుమార శాద్వలంగా మార్చగలదు
మండుతున్న ఈ అరణ్యాన్ని
మధు పాత్రలో దాచగలదు.

అప్పడే ఈ నిష్ఠుర జీవిత ఫలకంమీది
నిర్జీవ శాసన వలయాలన్నీ
వెలుగు నీడల రతి క్రీడలన్నీ
మీ కాంతి కేదారంలో శమిస్తాయి
నా భ్రాంతి విహంగాలూ తరిస్తాయి.

ఆంధ్రజ్యోతి వార పత్రిక, 23-10-87

తేజోనిధి

ప్రభూ!!
ఈ మేఘావృత జీవితాకాశం విడిచి
నీ వెలుగు సరసిలో విహరించేందుకు
అమిలమిల తారలను
తెరమరుగు చేసిన చాలు.

నీ కృపా ఫలితాన్ని
మృష్టాన్నంగా భావిస్తూ
ప్రీతితో నిన్ను సేవించే
పరితుష్టిని ప్రసాదించిన చాలు.

నీ వాక్యా మృతుపానంతో
ఈ చీకటి బ్రతుకు
కాంతి సాగర మయ్యేందుకు
మేటి చూపునిచ్చిన చాలు.

ఈ పార్థివరూప విలాసాలన్నీ
ప్రణవంలో ప్రస్థానించి
నాహృదియే తుదకు
తేజోనిధియైన చాలు

మయూరి, 7-11-86

పౌష్య పరిమళం

ప్రఫుల్ల పౌషీవిభవంలో
పొగమంచు పొరలతెరలు
ముద్దబంతియ మగువఎదలో
అవధు లెరుగని అనూహ్యవ్యథలు

మేటి విలువల హీనగతిలో
జియ్యరమ్యకె మౌన బాధలు
వెలుగు విరిసిన సరసివడుమ
వీడిపోవున నిశీథి నీడలు ?

మనసు అద్దము మంచు వీడిన
మనిషి మనీషిని చూడవచ్చును
పుష్పమపుడె ఫలదీకరించును
పుడమి తల్లియు పులకరించును

కరుణా స్రవంతి

ప్రభూ!!

ప్రపంచంలో ఉత్తమోత్తమైన ప్రతీదీ
నీ పావన హస్తాల్నించే ప్రభవిస్తోంది.
నా దారి మలుపుల్లో చీకటి పొరలు చొరకుండా
నీ దక్షిణ హస్తం నా శిరస్సుపైనే వుంది.
నా కన్నీటి సెలయేళ్లలో ప్రతిక్షణం
నీ ప్రేమ జ్యోతి వెలుగుతునే వుంది.

నీ నిగూఢ కరుణాస్రవంతిలో
నా జీవిత పాత్ర ముంచి నింపుకున్నా
నీ పసిడి పాదాల సేవించుటకై
నా తనువునే రిక్తం చేసికొన్నా
ఈ కన్నులతో నిన్ను దర్శించుటకై
నా మనస్సునే సమర్పించుకున్నా!

నీ న్యాయ పీఠం ముందు నిల్చున్నా
నీ న్యాయ దండాన్నే నే చూస్తున్నా, ప్రభూ!
నీ రాకకై నా ఆత్మ నిరీక్షిస్తోంది.
తుది తీర్పుకై ఎద వేగిర పడుతోంది.

ఆంధ్రజ్యోతి వార పత్రిక 2-1-87

వెలుగు రవ్వలు

పుడమి తల్లి పిల్లతెమ్మెర
తనువు సోకిన పులకరించు.
కలువ కన్నియ చెలిమిలోనే
వలపు వానలు తొలకరించు.
మంచి మనుషుల తీపి బాసల
తీపి తలపులు చెలగలించు

పొంగి పొరలెడి సంద్రాల గవ్వలు
అలలు మలచిన అచ్చెరల మువ్వలు.
నీలి గగనపు అందాల గువ్వలు
బ్రతుకు చీకట్ల వెలుగు దివ్వెలు
మనసు తోటలో విరియు పువ్వులు
ప్రభువు పరచిన 'వెలుగు రవ్వలు'

ఆంధ్రజ్యోతి వార పత్రిక 11-4-86

ప్రభంజనస్ఫూర్తి

చలంనడవ ప్రభంజనం
చలం భావమతి నవ్యం
వెలుగు చూడదేమో ఆభవితవ్యం
విలువలు వెలార్చిన ఈ సమాజం సమస్తం

చలం కవనమతి మధురం
చలం శిల్పం కడురమణీయం
చలం చూపు మహిళాభ్యుదయం
చలం తీరు అనుపమానం

మౌఢ్యానికే నేడూ అందలం
అజ్ఞానం నేడూ పదిలం
ఆదర్శాల పతనం అనంతం
కాలుష్యాలన్నీ మన సొంతం

అదో ముఖ సమాజానికి
చలం జ్యోతి అసంబద్ధం
'వెలుగు రవ్వల' చలం అరుణాచలం
" చివరికాన్క" చలం అజరామరం!!

ఆంధ్ర జ్యోతి దినపత్రిక 19-5-89 (చలం జన్మ దినం)

నిరీక్షణ

ప్రభూ!!
నేనో ప్రవాసిని
నీవు వుండీ కూడ
నేను అనాధుణ్ణి
కాని -
మౌనముద్రలో నిన్నెరిగినవాణ్ణి
సంకీర్తనల పావనజలంతో
నీ పాదాలను నిత్యం కడిగేవాణ్ణి
నిరంతర నిశ్చల స్వరంతో
నీ అనంత తత్వాన్ని కొలిచేవాణ్ణి
భవబంధాల్ని తెంచుకుని
ఈ మలినాకృతిని నీ ముందుంచినవాణ్ణి
మానవ జాతి కళ్యాణం కోసం
సర్వసాక్షీ!
నీ రాకకై నిరీక్షిస్తున్నావాణ్ణి.

చీడపురుగులు

ముద్దులొలికే మోము మీద
మాసిపోని మచ్చ యేల?
సొగసులొలికే సోగకన్నుల
పొంగి పారలే ప్రళయాంబుధేల?

పండు వెన్నెల పొన్నుపైన
కారుమొయిలు కమ్మనేల?
పావన నదీ జలాల పైన
పీనుగుల పయనాలు యేల?

జాతిరత్నాలని పేరుగాంచిన
రోజులన్నియు చెల్లిపోయేను
జాతి ఖ్యాతికి చేటు తెచ్చే
చీడపురుగుల కాలమొచ్చెను.

ఆంధ్రజ్యోతి వార పత్రిక 21-8-87

ప్రేమ

ఉవ్వెత్తునలేచినా
హద్దునెరిగిందే - అల
ఎంత వినియోగించినా
వట్టి పోనిదే - జల
కరుణ ఘనీభవిస్తే
మిగిలి నిలచేది - శిల

మనిషిని మనీషిగా
మార్చేదే - కలం
మానవుని దానవునిగా
మార్చేదే - బలం
స్వర్గాన్ని నరకంగా
మార్చేది - ధనం

మెరుపు దాడికి
చలించనిదే - దృష్టి
భూతలాన్ని
శాద్వలంగా మార్చేదే - వృష్టి
మానవ కళ్యాణార్థం
వెలిసిందే - సృష్టి

మనిషిని
కీర్తి శిఖరాలకు చేర్చేదే - శ్రమ
తనదికానిదేదీ
తనదనుకొనడమే - భ్రమ
గెల్చినా, ఓడినా
అజరామరమైనదే - ప్రేమ

తెనుగింటి దివ్వె

చిన్నారి, పొన్నారి, చిట్టి మల్లియలార!
కృష్ణవేణి కలిమి
కావేరితో చెలిమి
కలబోసి మీలోన
చూడ మనసాయె.

గోదారి గలగలలు
ఎల్లోర మిలమిలలు
మీలోన జతగూడ
మనసు ఉప్పొంగు

నీ తల్లి సిగలోని
మంచి మల్లియ వీవు
సిరిమల్లె రాసులై
ముదము కూర్చాలి.

మనసున్న మనిషివై
జ్ఞానంపు కడలివై
వేదాల వనిలోని వెలలేని పువ్వువై
తెనుగింటి దివ్వెవై
మనజాతి గరిమవై
వెలగాలి విశ్వాన
కీర్తి కేతనమెత్తి.

సేకరణ : బాలజ్యోతి జనవరి - 87

'స్వర్ణ' భారతి

బాపూ!!

నీ కమనీయ స్వప్నాలు
కల్లలౌతూన్న కఠోర వేళ
నీ 'స్వర్ణ' భారతి సర్వం
దయనీయంగా దృగ్గోచరిస్తోంది.

నీ విశ్వప్రేమామృతంలో
నీ అహింసావ్రత శరధిలో
స్నానించి, పునీతులైన
ఆ మహా మాన్యు లెక్కడ?

త్యాగాన్ని నిర్దిష్టంగా నిర్వచించి
స్వార్థాన్ని అక్షరాల పరిత్యజించి
దేశాభ్యుదయ యజ్ఞంలో
సమిధలైన ఆ త్యాగధనులెక్కడ?

నీతి నిజాయితీలకు నామంపెట్టి
అవినీతి అక్రమాలకు పట్టం కట్టి
దేశాన్నే దోచుకతింటున్న
ఈ 'స్కాముల' స్వాములా - నీ వారసులు!

సిద్ధాంతాల్ని సమాధిచేసి
ప్రజాహితాన్ని పాతిపెట్టి
భోగభాగ్యాల తరంగిణిలో
పరిభ్రమిస్తున్న తిమింగలాలా - నీ వారసులు!

అసంబద్ధపు పొత్తులమత్తులో
అరాచకపు కప్పదాటుల్లో
అశక్త అబలల అర్తనాదాల్లో
క్రీడించే కీచకులా - నీ వారసులు?

అంచుకే - మహాత్మా!!
నీ సైద్ధాంతిక జ్యోతులు వెలిగించు
దేశద్రోహుల కనులు తెరిపించు
బడుగుల స్వేచ్ఛా భారతిని రక్షించు
ప్రజా రాజ్యావతరణ గావించు.

దివ్యారామం

పరువెత్తు పైడి లేడి కోసం
వీడని ఎండ మావుల కోసం
నవ్వని మనోచిత్రాల కోసం
పరిమళించని స్నేహ సౌరభం కోసం
నిర్మానుష్యపు వీధి వైపు నుండి నిలబడి చూస్తూనే వున్నా
కాలాతీతపు కమ్మని కలయిక కోసం
కలల మంటల్లో కుమిలిపోతున్నా

కనుకనే ---
కాలం నిలబడినా, పరువెత్తినా
నాకొకటే - ప్రభూ!
నన్నశక్తుణ్ణి చేస్తున్న
ఈ అభాగ్యపు ఆశాపిశాచం
మృత్యుకుహరంలోకి తోస్తోంది.
అర్థంతరంగా దివ్వెనార్పి వేస్తోంది.

అందుకే ప్రభూ!
ఈ చీకటి పొరలు
నీ వెలుగు సరసిలో
ఈ చిరుదివ్వె
నీ బంగరు కౌగిలిలో
ఈ విహ్వల జీవనాడులన్నీ
నీ దివ్య ప్రేమాం బుధిలో
ఈ అస్థిర మలినాకృతి
నీ దివ్యారామంలో విశ్రమించనీ!
జన్మరాహిత్యంలో పరవశించనీ.

హృది వీణ

పసిడి బుగ్గల చాన
పరువంపు నెరజాణ
మిసిమి కన్నుల దాన
మదిపండె మరుల న[illegible]

కదిలించ[illegible]
కొత్త నింప[illegible]
[illegible]కు తొల[illegible] గాదె
నా వలపు కౌ[illegible]లో

హృదివీణ కదిలినది
శృతి కొరకె నిలచినది
ఈ వీణ [illegible]ంప
[illegible] [illegible]మో [illegible]

[illegible]
అయ్యె[illegible] మన [illegible]
వెన్నెలయె లేక[illegible]
విరితోటకే చెలిత.

కృపాభిక్ష

ప్రభూ!
ఈ కీర్తి శిఖరాల అకర్షణలన్నీ
నిష్ప్రయోజనం
పరమపద శిఖర వీక్షణం
నిత్యానంద దాయకం.

అందుకే ---
ఉషోదయం కోసం
ఎదురు చూస్తున్నాం
నీ మలి రాకకై
నిరీక్షిస్తున్నాం.

కానీ-
అజ్ఞానంతో చెలిమి
అహంకారపు కలిమి
ఈ హృదయాల్నింకా
బంధించే వున్నాయ్

అందుకే ప్రభూ!
నీ క్షమాభిక్షలో
మా పాపాలన్నీ పరిహరించనీ!
నాకున్న ఈ గరికతివాచీ
నీ అపార కృపా సంకేతంగాభావిస్తా!
నిన్నుస్మరిస్తూనే శాశ్వతంగా విశ్రమిస్తా!!

చైతన్య సంక్రాంతి

నింగినేలు ఉదయాద్రి శోభల
రంగురంగుల రంగవల్లుల
గొబ్బియల గారాల నెలవుల
రాగరంజిత రమ్యవిపంచిగ
సంకురాతిరి తరలివచ్చెను
సకల శుభావహమ్మై

మంచు ముత్యపు పిలుపునందిన
పుష్యమాసపు పడతి వధువై
మహీతలపు ప్రణయవేదిక
ముగ్ధమోహన రాగసుధగా
సంకురాతిరి మరలవచ్చెను
సకలసుగుణాభిరామమ్మై.

కృషికి ఫలితము చేతికందెను
రైతు బిడ్డకు ముదముహెచ్చెను
జియ్యరయ్యకు చేవవచ్చెను
తిరుప్పావై మధువు పంచగ
సంకురాతిరి శుభము పలికెను
సకల మానవోన్నతికై-

కానీ ---
గంగిరేడుల వినుతి హెచ్చిన
గంగిరెద్దుల గుణము పోవలె
హేతువాదపు విలువతెలిసిన
శాంతి పథమె మనదికావలె

భోగిమంటలు నింగికెగసిన
భాగ్యమేమియు కూడిరాదు
ఆ అగ్నిజ్వాలల దహనమవవలె
అంతరంగపు కలుషమంతము.

అపుడె జాతికి తేజమొదవును
భాగ్యరాసులె పొంగి పొరలును
ప్రజల రాజమెవెలసి నపుడదె
నిక్కమగు 'సంక్రాంతి' పర్వము.

ఆంధ్రజ్యోతి దినపత్రిక 14-1-86

కరుణా సముద్రుడు

విశ్వ జ్యోత్స్నలోని
వేవన్నెలన్నియు
ఒక్కమెరపులోనె
లుప్తమౌను.

హృదయసరసిలోన
ఎన్ని కుసుమములున్న
జ్ఞాన కమల మొకటె
జగతివెలుగు

అన్యకాంతులన్ని
అత్యల్పవ్యవధిలో
సమసి పోవుగాని
తిరముగావు

పాపరహితుడెపుడు
కరుణా సముద్రుడే
ఏసుప్రభువురీతి
ధరను బ్రోచు.

శూన్యం

నవ్వు శూన్యం
నువ్వు శూన్యం
పువ్వులాంటి నవ్వువున్న
నువ్వులేని నేను శూన్యం!

రేడు రేక నింగి శూన్యం
నీరులేని నదియి శూన్యం
మధువు వంటి మమత లేని
మతి గతియును శూన్యం!

నభం శూన్యం
నిశియు శూన్యం
నభం వంటి మదియులేని
నరుని జీవితమే శూన్యం!

ఋతువు లేని గయతియు శూన్యం
కలువలేని కొలను శూన్యం
కలువవంటి కనులు వున్న
నువ్వు లేని నేను శూన్యం

కరుణ లేని కొలువు శూన్యం
వెలుగులేని దివ్వె శూన్యం
చూపులేని కనులు శూన్యం
మంచి పెంచని మనిషి శూన్యం!

ఆంధ్రభూమి 12-9-94

కథ కంచికి పోయిందా!

చాసో! నీవింతలోనే
రావిశాస్త్రి పిలుపునందుకన్నావా?
ఈ జీవితపు ఎడారిలో
నీ వొక వయాసిస్సువు
జీవితపు వైవిధ్యాల్ని దర్శించిన
మహో దార్శని కుడవా?
తెలుగు కథా కథనంలో
ఖ్యాతిగన్న" పెర్‌ఫెక్షనిస్టు"వా?
పూర్ణా యుషును పండించుకున్న
నీ మనస్సొక చైతన్య శిఖరం.
ఇంతలోనే---
కథ కంచికి పోయిందా?
సిగార్ మాయమైపోయెనా?

క్రైమోడ్పు

అమరజీవి! కృష్ణశాస్త్రీ!!
నీ మంజులాకృతి కాంచని
నీ మధురవాణిని విననోచని
నా లాంటి అభాగ్యులెందరో!
కానీ - ఓ మహాకవీ !!
నీ స్ఫూర్తి మకరందాన్ని గ్రోలి
ఉన్మత్తమై విహరిస్తున్న
భావకవిత్వపు మధుపాలెన్నెన్నో
ఈ ఆంధ్ర సాహిత్యోపవనంలో
మధుర సుధాధారలు
వర్షిస్తున్నాయ్.

మనోహర పదచిత్ర శిల్పీ!
నీ ఉత్తమ కావ్య సింధూరం
'మంగళ కాహళి'
విజయ భారతి నుదిటి తిలకమై
ఆంధ్ర గేహాళిపై సరిక్రొత్త తళుకై
నిలుచు ఈ ధరణి నిలుచు వరకు.

మహతీ గుణ సన్నిభమైన
నీ 'అమృత వీణ'
సప్తస్వర శింజితమై
నీ జీవిత కృష్ణరజనిని
నిండు పున్నమిగా మార్చింది

నీ ఆకస్మిక మూగబాధను
తీపి పొరల్లో దాచింది.

నీవు కమనీయంగా మలచిన
ముగ్ధమోహన కావ్య నౌకల్లో
విహరించి పరవశిస్తున్నాం.
నీవు అలవోకగా సృజించిన
ఇక్షురస మహార్ణవాన్ని పుడు
వాచవించి తరిస్తున్నాం.

నీవిక తిరిగి రానే రావని తెలిసికొన్న
ఈ అశ్రుధారల 'క్రైమాడ్పు'
అందుకోవా? మహామనీషీ!
ఈ ఎదను ఊరార్చగ.

పావన మూర్తి

ప్రభూ!!

నీ దారుణ శిలువ మరణాన్ని
నీ పునరుత్థాన ప్రదీప్తిని
మననం చేసుకుంటూ
కాలవాహినిలో
ఇన్ని శతాబ్దాలు కలసిపోయినా
నిష్ఠుర మానవ నైజం మాత్రం
ఈ షణ్మాత్రమైనా మారలేదు.
అధర్మపు రక్కసి
నిజాయితీని కబళిస్తోంది
నీ వాదర్శించిన
సోదర ప్రేమ భావం.
అధరాలకే పరిమితమౌతోంది.
మోసం, ద్వేషం
అసహనం, అహంభావం
నీ సుగతి పథానికి మమ్మల్ని
దూరం చేస్తున్నాయ్!
అందుకే - మృత్యుంజయా!
నీ పునరుత్థాన జ్యోతిని
ప్రతి హృదయంలో వెలిగించు
అధోగతి నుండి తప్పించి
అభ్యుదయం కేసి నడిపించు
నీ మలిరాక వెలుగును
వీక్షించగల అర్హత ప్రసాదించు
మానవజాతి కళ్యాణార్థం
ప్రతి వానిని నీ ప్రతి రూపంగా మలుచు.

సంకురాతిరి సిలక

శందరా! మనవూరూ
సంకురాతిరి వొచ్చె
ఇయ్యాలీ పొగమంచు
మన మద్దెతెర ఆయె
సూసీ సూసీ కళ్ళు
కెంపూలతీరాయె
శాపకన్నులు నాయి
నీ సూపులో సిక్కె
సూరీడులోలోనె
సిందులేయేస్తుండు
సలవరేతిరికూడ
నాకేటి కీశవట!

మిరపసేనులోన
నీ సోకునే సూత్తి
సేరిపట్టబోతే
వొళ్లంత అగ్గాయె
పక్కననుసూసి
బంతిపూవునవ్వె
సగము పండగ గడిసె
సద్దే మోలే దాయె.
గంగిరెద్దులవోడి

సన్నాయి సొగ్గుండె
గొబ్బెక్కనాయేపు
గుబులుగా సూసింది.

సిగలోని పూలన్ని
సూత్తానే ఇడిపోయే
సెరకు తీపి కూడ
సెణంలో ఇసమాయె
నీ సూపు యెలుగులో
నిదరేమో రాకుంది
సుప్పనాతి సిలక
ఒరగన్ను సూస్తాది
బోగి మంటల కాడ
నిను సూడ మనసొద్ది
సద్దు సేయకవత్తె
నీ యెంట నేనొత్త!!

ఆంధ్రభూమి 11-1-87

వజ్రాల మూట

కుందుర్తీ!
బ్రతుకులోని నీళ్ళన్నీ
నీకే వదిలేసి
వెన్నెల్లో విహరించాలని
నిర్గమించిన నీ రాయంచను వెతుక్కుంటూ
నిమిషంలోనిష్క్రమించావేం!
ఈ తుంటరి త్రోవ
నీ సతీ ప్రియత్వానికి మాత్రం
ప్రతీకగా నిలిచి పోయింది

కానీ -
కందుకూరి, గురజాడల వారసత్వంలో
"మహాకవిత్వ దీక్షా పారమ్య పారవశ్యంలో"
మమ్మల్నేదో మురిపిస్తావని
"ఒడలు పులకరించే పూదదోట"లో
మమ్మల్ని ఉయ్యాల లూగిస్తావని ఆశించాం

కానీ-
ఇచ్చిన వాగ్దానాన్ని గాలికివదిలేసి అక్షయ చైతన్యంతో
మానవ జాతి మెరిసిపోవాలనే
నీ చిరస్వప్నాన్ని చీకటికే వదిలేసి
"పదివేల పంక్తుల వచన కవితల
వజ్రాల మూట" విప్పకుండానే
ఏం మునిగి పోయిందని కుందుర్తీ!
ఇంతలోనే ఆ వెలుగు సరస్సులోకి
ఒరిగిపోయావ్!

ప్రాచీన కవితాత్మలో ప్రఫుల్లమైన
ప్రకృతి కాంత కమనీయ కపోల కాంతుల్లో
మైమరవడం వ్యర్థమన్నావ్!
ప్రబంధ పారిజాతపు పరిమళ విన్యాసాల్లో
పలవరించడం పనికి రాదన్నావ్!
ప్రజా హితమే పరమార్థమన్నావ్
జనసాహితీలోనే జీవించాలనన్నావ్!
సమ సమాజ సౌధావిష్కరణకు
చైతన్యమే రాచబాటన్నావ్

కానీ - నేడో!!

ప్రతివాడు చైతన్యం! చైతన్యం! అంటూ
గొంతులు చించుకుంటూనే వున్నాడు
అంతరంగాల్లో గోతులు త్రవ్వుతూనే వున్నాడు
ప్రతివాడు నీతులు వల్లిస్తూనే వున్నాడు
దుర్నీతి సంపదను దోచుకుంటూనే వున్నాడు

పేదవాడి ఆకలి కేకలు ఇంకా
వల్లకాటిలోనే విశ్రమిస్తున్నాయ్
సమతా మమతల పొలికేకల్లో
దోపిడి గాండ్ర విషజ్వాలల్లో
పేదవాడి భవితవ్యం ఇంకా
దారుణంగా దగ్ధమౌతునే వుంది

నీ నిష్క్రమణ నాటి క్రీనీడల్లోంచి
ఒక్క వెలుగు రేఖ కూడ తొంగి చూడలేదు.
బలిదానపు విలువ బోధపడ్డట్టులేదు.
హంస నైజం మనిషి నేర్వనిదే
కంసుని రాజ్యం తొలిగేదెలా?

అభ్యుదయ సాధనకై, కుందుర్తీ!
బీదవాడు, చైతన్యవంతుడు కావాలన్నావ్
అప్పుడే దేశప్రగతి సాధ్యమన్నావ్
కాని సగటు పేదవాడు
నిరక్షరాస్యుడై ఉన్నాడు

కాబట్టే
నీ కవితా దీప్తి
వారి హృదయాల్లో ప్రతి ఫలించడమసాధ్యం
నీ చైతన్య స్ఫూర్తి
వాళ్ళ గుండెల్లో స్పందించడమెలా సాధ్యం

అందుకే -కుందుర్తీ!!
ప్రతి పేదవాడు అక్షరాస్యుడవ్వాలి
సామాజిక న్యాయ సాధన కోసం
పీడిత ప్రజ పిడికిలి బిగించాలి
అపుడే నీవాదర్శించిన
చైతన్యపు బాట నుంచి
చిరశైత్యం తొలగుతుంది
ఆ నవనవాభ్యుదయ కాంతుల్లోంచి
నవ్యభారతం వెలుస్తుంధి
ధర్మపాలన నెగడుతుంది

శుభచైత్రం

ప్రమోదూత చరమాంకంలో
ప్రభవించిన సమరజ్వాలలు
నరజాతి సమస్తంలో
నిరూపమాన రుధిరపటేరులు
జయాపజయ సమరంలో
మూగవోయెను హృదయవీణలు

కానీ-

చైత్రం ! ఓ నేస్తం!!
నీ శుభాగమనంతోనే
మారణహోమం ఆగింది
కాంతి కపోతం కదిలింది

మానవత్వం మొగ్గ తొడిగి
విశ్వశాంతి వర్ధిల్లాలి
శత్రుభావం తొలగిపోయి
బ్రతుకు బాట వెలగాలి

నవ వసంతపు పరిమళాలు
ఎదల పొరలు నింపాలి
ప్రజా పతివి నీవు
ప్రమోద భరితం చేయాలి

నవ జీవన ఉషోదయాన్ని
నరనరాల నింపాలి
నవ నవోన్మేషంగా నీవు
నిత్య కళ్యాణివై నడవాలి

ఆంధ్రజ్యోతి దినపత్రిక 17-3-91

జేజేలర్రా !

శ్యామ వర్ణవిజేత లారా!
జేజేలర్రా! జేజేలు!!
కాళ రాత్రులన్నీ కరగి
నవోదంపిలు స్తోంది
శతాబ్దాల జాత్యహంకారం
వీరోచితంగా తుదముట్టించారు
విశ్వ విఖ్యాతులైనారు

ప్రజల మనిషి ప్రజలకొరకు
గాంధీ పద దార్శనికుడు
ఇరువ దేడుల అజ్ఞాత వీరుడు
అపర గాంధీ మండేలాప్రోల
శ్వేజాతి శిరసు దించింది

చీకటి ఖండ చైతన్య మూర్తీ!
వివిధ జాతుల రధసారధిగా
దశ దిశల వెలుగు నింపు
నీ జాతిని మరల నెపుడు
తమసు జోలికి పోనివ్వకు

మీనవాభ్యుదయ పాలనలో
సమైక్యతయె ధర్మమై
సమభావయె సన్మతమై
పరహితయె పరమావధియై
అహింసయె కరదీపికగా
దీక్షా దక్షలతోనడవండి
స్వర్ణ స్వతంత్రాసాధాన్ని నిలపండి!!!

10-5-92 తేదీన శ్రీ నెల్సన్ మండేలా జాతీయప్రభుత్వాధినేతగా పదవీ స్వీకరణ సందర్భంగా

నవ్యసృష్టి

భారతీ! నీ బిడ్డను నీవే
ధర్మనిరతుని చేయాలి
అతి స్వార్ధం రూపు మాపి
ప్రజాహితం నేర్పాలి

దానవత్వపు దావా నలంలో
దహిస్తున్న దౌర్భాగ్యుడు
మానవత్వపు సంజీవనిలో
మృత్యుకుహరపథగాముడు
మానవ విలువల మధురిమలో
మరుల సోలయని మూర్ఖుడు
విశ్వ మానవ ప్రేమ నెరుగని
దారి తప్పిన పాంథుడు

ఆగామి వసంత శోభల
ఎదల నింపని అభాగ్యుడు
గత వైభవ స్మృతులన్నీ
కాలరాయు క్రూరుడు
భారతీయ సంస్కృతినే
పరిహసించు పరతంత్రుడు
అర్థంలేని దారుల్లోనే
హితం వెదకు అజ్ఞానుడు
అందలాల ఆకర్షణలో
నీతి వదలు నిర్భాగ్యుడు
స్వార్థ సాధన చింతలలో
ఆత్మనెరుగని అనామకుడు

అందుకే తల్లీ!!!
నీ పవిత్రాత్మను నీవు తప్ప
పరిరక్షించు వారు లేరు
నీ విశ్వాత్మను మేలు కొలిపి
నవ్యభారతం సృష్టించు!!

విశ్వహిందూ మే, 88 సంచిక

వివేకానికి నాంది

హృద్యంగా ఉన్నదంతా
హృదయైక వేద్యం కాదు

ఆగమ్యంగా ఉన్నదంతా
రమ్యంగా ఉండబోదు

మృగతృష్ణ, మృత్యువు
నిరాశోపకారకాలే
మృగతృష్ణ కన్పట్టి
కనువిందుగ ఎడ్పించును

మృత్యువు కాన్పించకయే
కడతేర్చును జీవితేచ్ఛ
ప్రభాత భేరివివేకానికి నాంది
బ్రతుకు కడపటి సృజనాభిలాషకు
చరమ సంధ్యా ఛాయ పరిపంథి

అంధ్రభూమి 3-4-86

జీవన కాంక్ష

బుద్ధి-

ఈ లోకాన్నంటిన
ఊసులముసురునుండి
అత్యాశల ఊబినుండి
తిరోన్ముఖం కావాలి

జ్ఞానం -

పరలోక సంగతమై
భవభయహరమై
బంధవిముక్తయై
ఊర్ధ్వముఖం కావాలి

ఆధర్మం-

అనుక్షణం క్షీణిస్తూ
అజరామర కాలాన్ని
మానవానుభవయోగ్యంగా
అవిర్భవింపజేసేందుకు
అధోముఖం కావాలి

అంధ్రభూమి 3-4-86

సౌందర్యమూర్తులు

ఆత్మ సౌందర్యమూర్తులు
అకస్మాత్తుగా
అస్తమిస్తున్నారు

మానవాళి మౌన ఘోషలో
మానవతాశిఖరాలు
నెలకొరుగుతున్నాయ్!

అనాధుల అర్థనయాల్ని
అనుకంపించే అమృత హృదయాలు
అదృశ్యమవుతున్నాయ్!

దీనబంధు మదర్ థెరిసా
పీడి తజన బాంధవి డయానా
అనూహ్య ప్రస్థానంలో
అభాగ్యజీవులు రోదిస్తున్నారు
అశ్రుని నివాళులర్పిస్తున్నారు.

30-8-97 తేదీన ఉ|| 3-45 ప్రిన్స్ ఆఫ్‌వేల్స్ డయానా ఫ్రాన్సులో దుర్మరణం చెందారు 6-9-97 మధర్ థెరిస్సా కలకత్తాలో అస్తమించారు. వీరి స్మృతికి సమర్పించిన వేదనాగీతి..

లాలస

శ్రావణామేఘమా! నీవు
విరిజల్లులు కురవాలి
మేఘమాలలైన నా ఊహలు
తటిల్లతికలై విరియాలి

శరచ్చంద్రికా! నీవు
చలువ పందిరులే పరవాలి
తారలతోరణానివై నీవు
తళతళలు నింపాలి

నీతోనే ఈ జీవన గమ్యం
నీవు లేకుంటే అంతా ఆగమ్యం
విడిచీ విడువని బంధం
కొసరి కొసరి కోరాను
విరిసీ విరియని వసంతం
మిసిమి తరచి చూచాను

ఆంధ్రభూమి 3-4-86

పసిడి దివ్వె

ప్రాదుర్భావంతోనే
పిడికలింత పసిడి దివ్వె
పరబ్రహ్మ స్వరూపమై
ఆ జన్మాంత దివ్యజ్యోత్స్నతో
విఘడియ విశ్రమించక
పాంచభౌతికాలనూ
పాపవిముక్తం చేస్తుంది!
ప్రణవనాద సంభరితమై
అముష్మికం ప్రసాదిస్తుంది!!

ఆంధ్రజ్యోతి దినపత్రిక 3-11-94

నావాణి నీ బాణి

నీ సొరు నాగుండె
నిండిపాడిన వేళ
కాలవాహిని కెంపు
కావ్యాలనే నింపు
నావాణి నీ బాణి
కనుల కలసిన వేళ
కలిసె ఈ జగమంత
కళ్యాణ రసలీల!
కావ్యకన్యవు నీవె
కలలతూలిక నీవె
కల్లోల జగతికి ప్రణయ
సల్లాపమైరావె!!

ఆంధ్రభూమి 3-4-86

నానీ! నానీ! నాదోమాట

నానీ! నానీ! నాదోమాట
చెప్తా నీతో వింటావా?
నేనూ నీలా ఉండీనప్పుడు
చక్కని బ్రతుకు నాదీ గూడ!

ఈ లోకం నీమోమై ఉంటే
ఇహమే నాకమై తోచునులే
కలువచిన్నెల నీదరహాసం
కలతలపాలిటి పరిహాసం!

ఎదిగీ, ఎదిగీ, ఎదిగిన కొద్దీ
మోహపు గీరలు పెరిగేను
పాపపు రొంపిమె మిగిలేను
నానీ కన్నా అన్నీ నువ్వే
నాకూ మిగిలిన నవ్వూ నువ్వే!

నీ కమ్మని చూపుల కలిమియంతయు
నా బ్రతుకు బాటన పరచెనులే
నీ మిసిమి వెన్నల నయనాలు
నేవలచిన ఇహమే పరమాయె
నీ బులి బులి నడకల తీరూ జూచి
ఈ జగమే నేనూ మరవాలి!

వేదాలందలి జ్ఞానమునువ్వే
భేదాలందలి మోదము నువ్వే
జాతికి ఖ్యాతియు నువ్వే
రేపటి విశ్వపు నేతవు, జ్యోతివి నువ్వే!!

ఉజ్వలించేదెప్పుడు ?

జననీ! జన్మభూమి!!
పొగమంచు తెరలు
వీడెదన్నడు?
కులరక్కసి కోరలు
కూలే దెన్నడు??
హింసానలం
సమసేదెప్పుడు
అశ్లీలతపిశాచి
అంతర్ధానమయ్యే దెపుడు?

కుటిల స్వార్థ పరాయణత్వం
కాలంలో కలిసేదెన్నడు?
నిరంతర రక్షణ వలయం నిర్గమిస్తూ
నవనాగరికతకు భద్రత ఎపుడు?

రక్షక భటుల సహోదరులై
సమాదరణ సమకూర్చేదెప్పుడు?
తిరోగమన శక్తులు
పరాజితులయ్యేదెన్నడు?
జన చైతన్యప్రాభాతంలో
ప్రజాస్వామ్యం ఉజ్వలించేదెన్నడు?

అక్షరార్చన

నవయుగకపు కవిచక్రవర్తీ!
నీపద్యచనా మాధురితో
రసరమయ్య హృదయాంతరాల
కలకాలము నిల్చెదవు
కడు రమణీయకమై

వస్తువు అనల్పమైననేమి
కథాకథనవిభవంలో
కరుణరసపోషణలో
జగత్సత్యాల విశ్లేషణలో
"రాత్రికి కనులువచ్చె"

జాషువా కవీశ్వరా!

తాజ్‌మహల్‌లో షాజహాన్ నిల్చువరకు
'వల్లకాటి బూడిద'నుండి వెలార్చిన
మట్టి బొమ్మశిల్పిగా నిల్చెదవు నీవు
యుగయుగాంతముల వరకు

నేటికులాల బేరీజుల ఘోషల్లో
నలిగిన నిస్సహాయుణ్ణి మేల్కొల్పావు
కులములేదన్న వానినీ
కళలు మోహించునని వెన్ను తట్టావు

కళారవీ!

ధరిత్రి తెనుగు నేల చెరిగిపోవు వరకు
ఆంధ్రరసిక జనావళి వసించు
నీ "ముమతాజ్‌మహాలు" నందు
కావ్యరసానందసంతుష్టులై, ముగ్ధులై!!

శ్రీ జాషువా 98వ జయంతి సంధర్భంగా సెప్టెంబరు 28

సిరిమల్లెపూలు

చిన్నారి పొన్నారి
చిట్టి చెల్లెళ్ళూ!
సిరులెల్లకొని తెచ్చు
బుజ్జి తమ్ముళ్లూ!

కృష్ణ వేణీ కలిమి
కావేరి తోచెలిమి
కలబోసి మీలోన
చూడమనసాయె

గోదారిగల గలలు
ఎల్లోర మిలమిలలు
మీలోన జత గూడ
మనసు ఉప్పొంగు

మీ తల్లి సిగలోని
మంచి మల్లెలుమీరు
సిరిమల్లెరాసులై
ముదము కూర్చాలి

మనసున్న మనుషులై
జ్ఞానంపుకడలియై
వేదాల వనిలోని
వెలలేని పువ్వులై
మనజాతి గరిమలై
విలసిల్లు విశ్వమున
కీర్తి కేతన మెత్తి

ఆంధ్రప్రభ వార పత్రిక 22-4-87

ప్రస్థానం

ఆంగ్ల మూలం : **పింగళి పాండు రంగరావు**

" ది స్పిరిట్స్ పిల్‌గ్రిమేజ్"

స్వేచ్ఛానువాదం : **పైడిశ్రీ**

1

పారలౌకిక పారవశ్య మాధురిలో మునిగి కాబోలు
వెలుతురు పండగ చేసుకుంటోంది ఆకాశం
జీవితాన్ని ఊరిస్తూ
ఆకాశంలో విచ్చుకున్న కుసుమపథంలో
తాపీగా అడుగులేస్తున్నాడు శరత్తరుణ శశి.

ఆ అడుగులలో ఒక సవ్వడి
ఆ సవ్వడులలో ఒక అగోచరలయ
ఐహిక చింతనాగ్రస్తమైన మనస్సుకు
సర్వాంతర్యామి పాడుతున్న జోలపాటల్లా!
మనసు మారుమూలల్లో విచ్చుకున్న
ప్రేమపూలతోటల్లా!

జోలపాటలకు సోలిపోవలసింది పోయి
జీవితపు దుఃఖాన్నంతటిని ప్రోగు చేసుకుని
కుళ్లి కుళ్లి ఏడుస్తోంది హృదయం
కుటిల జగతిలో ఈ జీవితమింకెన్నాళ్లని?

2

ఓ తళుకు సొబగుల తారనివహాల్లారా
మీ సౌందర్యోద్దీపనా విలాసాలలో
రూపు దిద్దుకుంటుంది
నా శాశ్వత బ్రహ్మానంద జ్యోతిర్లత

తోచీతోచనిదే అయినా
విశ్వమంత ఘనమైన
మీ మిణుగురు కిరణాల శాశ్వత శాంతి ద్యుతుల్నే
గాఢంగా అభిలషిస్తాన్నేను
మీరు ఎంత శాశ్వతమో
నా ఆత్మ అంత శాశ్వతం
శాశ్వత విశ్రాంతి కాముకుణ్ణి నేను

నీటి బుడగల విడిదులు నేనాశించును
పరస్పర సాన్నిహిత్యాభినివేశంలో
ఒక దివ్యసౌందర్యావిష్కరణం
తత్ దివ్య సౌందర్యపు సౌరు ఆ చంద్ర తారార్కం!!
అందుకే
నన్ను మీ కాంతి క్రీడల క్రీనీడలనైనా సేదతీరనివ్వండి

ఓ తళుకు సొబగుల తారా నివహోల్లారా!
త్రోసుకెళ్లండి నా జీవన భగ్న నౌక!
త్రోవలో నా ప్రభువు కలియునందాక!!

3

ఓ శక్తిమంతములైన మహాసాగరాల్లారా!
శాంతి గంభీరాలైన మీ బృహద్వైశాల్యాలు
సృష్టి కల్పపుటంచుల్ని స్పృశిస్తూంటాయి
చావు పుట్టుకల జీవరహస్య ప్రతీకలైన
మీ కెరాటాల అంచుల మీద
కోరుకుంటుంది నా ఆత్మ చక్షువు - చిత్రమైన నిద్ర
నిద్రలో తన ప్రియుని పదముద్రలు చూడాలనేమో

ఓ శక్తిమంతములైన మహాసాగరాల్లారా
త్రోసుకెళ్లండి నా జీవన భగ్ననౌక!
త్రోవలో నా ప్రభువు కలియునందాక!!

4

ఓ అవిశ్రాంత గర్జనల అమృత నిర్ఝరీసఖులారా
బంగారు కిరణాల బారులు తీరి
అలలపై అలవోకగా ఉద్దీపిస్తోంటే
అగోచరమైన సత్యాలను అంతటా ఆవిష్కరిస్తూ

శతాబ్దాల తరబడి అలా ఒక్కళ్లే సాగిపోవడమేనా లేక
నన్ను పరమాత్ముడి పేర వెలిసిన
రోచిర్లోకాలకు తోడ్కొని పోవడమేమైనా వుందా!
ఓ అవిశ్రాంత గర్జనల అమృత నిర్ఝరీ సఖులారా
త్రోసుకెళ్లండి నా జీవన భగ్ననౌక!
త్రోవలో నా ప్రభువు కలియునందాక!!

5

ఓ మంచు మేలిముసుగుల పర్వత సానువుల్లారా
నిస్తుల ప్రతిభా ప్రదీప్తుడౌ
అదృశ్య శిల్పి ఊహాసౌందర్య గరిమకు
తీర్చిన ఆకారాలు మీరు
పవిత్రతకు గంభీరతకు ప్రాకారాలు మీరు.

దాచుకుంది మీ ఆకృతి!
జన్మాంతరాల ప్రణయ స్మృతి!
ఘన శిలాఫలకాల గుండెలలో ఓ గాథా సప్తశతి!

మీ శిఖర వినిర్గత వినిర్మల నిశ్శబ్ద తరంగం
నా ఆత్మను కదలనివ్వదు
ఆత్మను నిద్రపుచ్చే
జోలపాటల రహస్యం తెలుసుమీకు

ఉండిపోవాలనుంది మీ పద పీఠీ చెంతనే
ఎండిమియన్ లా ఎన్నటికీ మరెన్నటికీ...,

కానీ
ఆకాశ మధ్యంలో ఎవరిదో విశాలమైన గొంతుక
పవలూరేయి నా కోసం విరహ గీతాల పాడుతోంది

ఓ మంచు మేలి ముసుగుల పర్వత సానువుల్లారా

త్రోసుకెళ్లండి నా జీవన భగ్న నౌక
త్రోవలోనా ప్రభువు కలియునందాక.

6

ఓ మహారణ్యాల్లారా
మట్టితో దేవుడు చేసిన
మరో మహనీయ సృష్టికి
మచ్చుతునకలుమీరు

ఆతడి మహిమలను
మహిని నినదించే మౌన స్తోత్ర గీతికలు మీరు
ఆతడి కరస్పర్శలో మీరు అమర మూర్తులైనారు

మీ నిండా జీవనోల్లాసము
మీ మనస్సులో మనసుకు సైతం అందని మార్మికత
మీ వదనాల్లో చిరంతన హరిత దరహాస విన్యాసాలు
మీ ఉనికిలో ఒక చమత్కృతి, ఒక నిర్మలత

తత్ స్థగిత కాంతి పుంజాల పునరేకీకరణ కోసమే
నా ప్రాణం ఆలపించే ఈ అమృతగానం
ఓ మహారణ్యాల్లారా
త్రోసుకెళ్లండి నా జీవన భగ్న నౌక!
త్రోవలో నా ప్రభువు కలియునందాక!!

7

ఓ లావణ్యం తొణుకారే లోయల్లారా
రాశీకృత రామణీయకపు రసస్యందినులారా

అందాలను విరజిమ్ముకుంటూ
అవ్యక్తమాధురులను వెదజల్లుకుంటూ
అద్భుతాల వలువలు దాల్చిన మీ అందాలకు
పులకించిన నా ఊపిరి పూల పాట పాడుతోంది
పూలపాటలకు నాడీతంత్రికలు మంత్రముగ్ధలౌతున్నాయి.
ఆశించుట మినహా
మీతో సహవసించలేని నిస్సహాయత నాది

ఎందుకంటే--
మృత్యుకేతనాలు మోహరించిన నీలిలోయల వెంబడి
సాగిపొమ్మని శాసింపబడ్డ బ్రతుకునాది

కలల పూల కోసం కేలు చాపడం ఆలస్యం
కాలం నాకళ్ళను కత్తిరించేస్తుంది.

కనుపాపలలో కలలకు ముసిరే మునిమాపులు
కళ్లనుండి గుండెలోనికి జారిపడే జాలి చూపులు

ఎదలో సౌందర్యాస్వాదనా కాంక్ష
ఎదుట శత్రువు గీచిన నిర్బంధ కక్ష్య
ఎంత విచిత్రమో ఈ జీవితం అనే అగ్ని పరీక్ష

ఓ లావణ్యం తొణుకారే లోయల్లారా !
ఓ రాశీకృత రామణీయకపు రసస్పందినులారా !

త్రోసుకెళ్లండి నా జీవన భగ్న నౌక !
త్రోవలో నా ప్రభువు కలియునందాక !!

8

ఓ తీయటి గీతాలలపించే తరుణ శాకుంత శాబాకాల్లారా
మీ పాటలు
స్నిగ్ధ సుకుమార కాంతల సయ్యాటలు
మీ పాటలు
అందాలు ఆడుకునే రోచిర్నందనోద్యానాలు
మీ పాటలు
ప్రాణస్నేహితుడి పెదవుల ఓదార్పు వూటలు
మీ పాటలు
క్రూరత్వం నుండి కుటిలత్వం నుండి దూరంగా లాక్కు పోతాయి.

మిమ్మల్ని చూస్తో నిలబడితే
నా దౌర్భాగ్యం దుర్బలత నన్నువెక్కిరిస్తాయి.
సినీ వాలి శిలాకేళి అప్రయత్నంగా ఆవులిస్తుంది

కడుపులో శబ్దాల్ని దాచుకున్నా
పెదవులు కదలని మూగతనం ఆవహిస్తుంది.
అందుకే నన్ను మీ బృందంలో చేర్చుకోండి
మీరు పాడే మహిమ గీతాలను నన్నూ పంచుకోనివ్వండి
కోటి కోట్ల గొంతుకల కొత్తపాత చప్పట్లలో
నా గొంతుక గీరలేవో నన్ను పోల్చుకోనివ్వండి
నా పాటల చాటుగా నావిభుడి దరహాస చంద్రికల్ని
చకోరికనై నన్ను త్రాగనివ్వండి

ఓ తీయటి గీతాలాలపించే తరుణ శకుంత శాబకాల్లారా

త్రోసుకెళ్లండి నా జీవన భగ్న నౌక
త్రోవలో నా ప్రభువు కలియునందాక

9

ఓ మనుషులనే పదాలకు వారసులారా !
సర్వేశ్వరుడి పిలుపు వినలేని స్తబ్ధమనస్కులారా

వక్రరేఖల జీవిత చక్రపుటిరుసుల చుట్టూ
పరిభ్రమిస్తూ పరిశ్రమిస్తూ
మీరు కట్టుకున్న మట్టి కోటలు మట్టి రేణువుల్లోనే కలిసిపోతాయి
ఇసుక పర్రల్లో శిల్పించిన విజయ గీతావళి
సుడిగాలివ్రేళ్ల తాకిళ్లకు చెల్లాచెదురవుతాయి

నశ్వర జ్ఞాపకాల్ని నంజుకు తింటూ
ధూళి ధూసరితమైన చీకటి కోణాల్లో
నీవు చేసే నృత్యాలు పాపకృత్యాలు
నిప్పు కణికల్ని ప్రసవిస్తాయి.
నిశీథి కేకల్ని ప్రవచిస్తాయి

అప్రియ సత్యాల సమక్షంలో
నువ్వు విచారింపబడతావు నిర్దాక్షిణ్యంగా

ఐహిక బంధాల్నించి నిన్ను వేరు చేసే
ఓ అగ్ని కేదారంలో నువ్వు సమాప్తమైపోతావు

అప్పుడు నువ్వు కోరుకున్నా వెలుతురు దొరకదు
నీ ఆత్మ చీకట్లను తిని బ్రతుకుతుంది

నా ఆత్మ అలా కాదు!
పరమాత్మ ప్రసాదిత జీవౌషధంతో అనుసంధితమై
శాశ్వతత్వపు కవచం చుట్టుకుంది
పంచభూతాలు నామీద ఆధిపత్యం కోల్పోయాయి
అనుక్షణం -
సకల సృష్టి కారకుడైన వాడి
చరణ సాన్నిధ్యం కోసం పరితపిస్తుంది

ఆగ్రహ ఓటములకు
ఆగ్రహ కూటములకు ఆవల
పాలపుంతలు పాండుర జవనికా చయాల వెనుక
పాల నవ్వులు ఒలక బోసే
పరమేశ్వర పదరాజీవాల చెంత
పరిసమాప్తమౌతుంది
జన్మరాహిత్యం లో
చిర వాంఛిత శాశ్వతత్వంలో

అక్కడే నా యాత్రకు చివరి మజిలీ
అక్కడే నా పాటకు చివరి ఆలాపన

ఎవరు సాయం వచ్చినా రాకున్నా
ఎవరు ఎన్ని కంటక సాగరాల్ని నా బాటలో పరిచినా
త్రోసుకెళతాను నా జీవన భగ్ననౌక !
త్రోవలో నా ప్రభువు కలియునందాక !!

చాంద్రాతప సీమల్లోకి.....

ఓం కవితా కామినీ!
ఈ చరమ సంధ్యాకు టీరాన
నీ పదరేణువు నా శ్రయించా.
నీ మణిమయ కాసారంలో
అఘమర్షణ స్నానం చేయాలి.
కాని సంధ్యాకాశంలో వుంది
నా జీవన యానం
వెలుగు చీకట్లు కలబోసుకుని.

నీ ప్రథమ గంధర్వ లోక నివాసం
మంజుల మధుర పద బంధురం
ఈ సాహితీ స్రవంతి తీరాన
నన్ను పుడైనా కూర్చుండ బెట్టావు.
అలభ్య హేమపాత్రాన్నం
నేటికైనా నాముందుంచావు.

ఈ రజనీ ప్రియ హృదయ కేదారంలో
వికుంఠాను భూతుల నింపు
జీవచ్ఛక్తి, చైతన్యాన్ని ప్రసరించు
భాద్రపథంలో భాగీరథిలా
కవితామూర్తుల నెందరినో
నా కనులముందు నిలుపుతున్నావ్ ॥

నా నిసర్గమనోహరివైన
నీ ఆకృతి నిభృత సుందరం
నా ద్వేషం సృష్టించ లేని
అమర జీవనపు లోకాన్ని
నీ ప్రేమ సృష్టిస్తోంది।
ఆయుష్మి కాన్ని ప్రసాదిస్తోంది!!

రమణీప్రియ దూతికా!
ఈ నిత్య నూతన భావాల్నించి
ఓ రమణీయ సౌధం ఆవిర్భవిస్తోంది.
ఆ శశికాంత వీధుల్లో తృప్తిమీర
విహరించనీ, పరవశించనీ!!

ఈ అవిక్రాంత, అజరామర
కవితోజ్జ్వల కాంతి కౌగిళ్లలో
నా చిరుదివ్వెను వెలగించుకోనీ!
పారలౌకిక శక్తి స్వరూపిణిగా
స్రాపాదగుణాన్నదించావు
పరమార్థం ప్రసాదించావు!!

కానీ-

కవిజీవనం కావ్యంలా ఉండాలనే
కన్న కలలు ఇంకా పండనే లేదు
నా ఈ కవిత భావావేశభరితమై
సౌందర్య సాక్షాత్కారంలో
ఆత్మ నిర్భరతను పెంచాలి
ఆత్మను పరమాత్మతో సంధించాలి!!

నీవు కాంతని సృష్టించావు
నేను దీపాన్ని వెలగించుకోవాలి
ఈ దీపశిఖ ఏనాటికైనా
అనంతంలో అదృశ్యమవుతుంది
నీ కాంతి హేల మాత్రం చిరంజీవివై
యుగయుగాంతాల నిల్చిపోతుంది!!

అజ్ఞాతమనోహరీ!

నీవు ప్రసాదించిన కావ్య కల్పనాజగత్తులో
ఈ శేష జీవనయానాన్ని నిరంతర సాగిపోనీ!
ప్రపూర్ణ పరిమళాలునిండిన

ప్రభంధాల సా కార రూపిసీ!
ప్రౌఢ నిర్ఝర వయః పరిపాకంలో
ప్రారంభమైందినా కవితా తపస్సు
నీవు నా హృదయంలో పండించే
వేడుకల వన్నెలకు వెలకట్టలేను
ఆ వరవడిలో విరబూచే మిసిమి
పసిడి రాసుల పరువాలనుకొలవలేను

జీవితేశ్వరీ!

నీ కోవెల తోటలో నన్ను కూర్చుండనీ
వేసవి సంధ్యలకుసుమ విలాసాలను
నా అంతరాంతరాల్లో ప్రవేశించనీ
నాకు కవితల రెక్కల తొడిగావు
కానీ నిశాలోచనల్లోనా బ్రతుకు
వృథా పర్యంకం నిలవనీకు!!
ఈ శిథిల వీణె నిలాగే వదలివేయకు
నీవాఙ్మాధురిలో నన్ను కడతేరనీ!
నా జీర్ణగళంలో నీ మధురిమలు నిండాలి
నా కలలన్నీ పండి తీరాలి!!

హృదయేశ్వరీ!!

ఇహ లోక భావనిర్గమనంలో
నాపుణ్యాలు పండుతున్నాయ్!
ప్రబంధ పారిజాత పరిమళాలన్నీ
నా గుండెలనిండ, నీలోకవలో కనమయ్యింది
ప్రాచీన కావ్యాల్లోని
సుందర పద బంధురతను
అనన్యరాజసౌధాల్లో నికవి రాజుల
కమనీయ సాహితీ విందుల్ని
నన్ను ముదమార ఆరగించనీ
త్వరగా, త్వర త్వరగా......

నీ అమృతం నాధికాకున్నా
ఓ మధు శకలాన్నైనా
నా అధరాంచలాల పవళించనీ
నీ సాహితీ క్షేత్రంలో
నాచేవెట్టి చాకిరి చేయించుకో
కాని ప్రాణపదంగా పెంచుకున్న
నా ఈలతాంతాలను మాత్రం
నీవు ప్రీతిమీరసురభీకరించు
నెనరు మీర వాటిని లాలించు, పాలించు!!

కావ్యకన్యకా!!

నీవు నాలో నిలిచిపోతే
ఈ లోకమే నాకు వైకుంఠం
నా కన్నీళ్లలోంచి నీవు పుట్టావు
నా కావ్యచక్షువుల్లోంచి జాలు వారే
ఈ ఆనందతరంగాలు, ఒరుసుకుంటూ
మందాకిని తాతున్నాయ్!!
ఈ అచిరజీవనయానంలో
నీతో వెన్నెల స్నానాలేకాని
చీకటి జల్లులకు తావుండదు

నీ నిరంతర పదసేవనయే
నేనభిలషించే ముక్తికి మార్గం
అందుకే - పద, పద - వడివడిగా
నీకేలూని నేనడువగా
నా గీతానికి శృతికూర్చే
నవచంద్రిక లేదిచట
ప్రస్థావింతము పదవే!
మన చాంద్రాతపసీమల్లోకి..........

హృదయప్రసూనం

స్వచ్ఛసుధాపరిపూర్ణ ప్రణయైక మూర్తీ!
నా హృదయార్ణవనుండే
బ్రతుకు ఒడిదుడుకులతో మొదలైంది
నాల్గుదారులు కలిసే కూడలిలో
నల్లబొగ్గుల్ని పంచుకుంటున్న
నా జనాన్ని చూచాను, నిస్తేజంగా!

నా మనసు పరాయత్తమై
నాతో పాడనంటే
నా గీతితో శృతిని కలుపకుంటే
నామమత సిగ్గుతో
తలదించుకుంది

ఈ ధూర్తిలోకంలో బ్రతుకీడుస్తూ
సూటిగా సత్యాన్నే
అంటిపెట్టుకోవాలనే భావాన్ని
అసమర్థత పండించిన
అవివేకంగా
కొట్టి పారేసిందీలోకం
అరణ్యరోదనలో
వలపు వసంతాన్నెలా పిండుకోగలం?

సెలయేటి గలగలల పసిడి మిసిమితో
మురిసిపోయే మనసుతో
కసాయిలోకంలో సుఖంగా
కాలక్షేపం చేయాలనుకోవడం ఎలా?

నా చైత్రపు రాత్రుళ్ళన్నీ
కొసరి విరిసిన మల్లియవలె
పర్వత సానువుల పరువాలవలె
ముగ్ధ మధురంగా ఉండాలని సంభావించడం
శుద్ధ అవివేకం, వ్యర్థ వినోదం

కలలమసకలోని క్రూరభవితవ్యం
నన్ను చిత్రంగా హింసిస్తున్నపుడు
కాలానికి గాలం వేయను
కరుణకై వలను విసరను

హోరుగా లిరొదలో
గాలి వాన ముసురులో
మేఘమాలికవిడిల్చే
విద్యుల్లతల సోయగాల్లో కూడ
పరమాత్మను ఆవిష్కరించుకుంటాను
ఆత్మసాక్షిని దర్శించుకుంటాను

తరు శాఖల కదిలికల రహస్యాలన్నీ
నాకు అర్థం కాక పోయినా
ఆ ఊడల నీడల్లో
తిరుగాడాలనిఉంటుంది
ఎద పరవిశిస్తూ వుంటుంది

నీ ప్రేమ గానా మృతాన్ని దోచుకొమ్మని
ఆ మధుపాలకు ఎవరు నేర్చారు? ప్రభూ!!
నా కన్నులలోతుల్నించి జాలువారే
ఈ కన్నీటి కాలువను కన్నావా, దేవా!

ఈ చరమ సంధ్యలో విలీనమయ్యే
ఆ వరదు పొంగును కనవేల, ప్రభూ!

నా హృదయంలో హర్షం ఉద్భవించి
కనపడని మార్గాల సంచరించి
ఏఅనల నిలయాలకు చేరునో, ప్రభో!
నేవే సారి నడచు ఈ బాటలో
నీ పాదముద్రలో నను కరుణించేనా, దేవా!

మానవ భాషలోంచి నిష్క్రమించి
నా మూగవ్యధారోదనలో
నిన్నధిష్ఠించుకున్నాను ప్రభూ!

నవనందనాల్లో విరియు
కుసుమ సంపదన జేర్చి
పూలదండగా కూర్చి
నా కవితోపహారంగాతీర్చి
నీ కంఠసీమ నేనలంకరించిన క్షణాల్లో
నా కంఠం మూగవోయింది
రక్తధారగా రూపుదాల్చింది

అందుకే ప్రభూ!!

నిన్నటి, నీరూపు నేడు పోల్చుకోలేకున్నా
నీ మహాసౌందర్యావలోకనలో
నేకరగి కలిసిపోతున్నా

నా చిరవాంఛిలాల మబ్బులు
నన్ను చుట్టిముట్టి నిలదీస్తున్నా
నీ పసిడి వాకిట నిలబడి
నీ కృపకై నిరీక్షిస్తున్నా

ఈ భూతల సుందర శాద్వలాన్ని
ఉషోదయకాంతిరేఖా విలాసాల్ని
గాఢనీలాకాశపుగానాల్ని

మల్లియల మనోహర పరిమళాల్ని
మాలతీ మధుర సుగంధ సమీరాల్ని
మందాకినీ విమల పావన సలిలాన్ని
హిమబిందు సందోహపు స్వచ్ఛతనూ
ఈ చరమ సంధ్యా సమయంలో
నాపసిడి లేఎండ
ఈ క్షణం నీ పాదాల చెంత నిలిపింది
సద్దు నిద్రించిన ఈ శర్వరీనీడల్లో
నీతో నేను నడువలేని క్షణాల్లో
నా మౌనం నీలో విలపిస్తోంది
మృదుల హృత్తంత్రులనే ఛేదిస్తుంది.
ప్రభూ!!
ఈ విషాధ అగాధ లోతుల్లో
ఈ అన్వేషణ ముగిసేదెప్పుడు?
ఈ నిర్వేదం సమసేదెన్నటికి?
ఏది ఎటులైనా ప్రభూ!!
ఇదే నా చివరి కానుక
అందుకో ఈ హృదయ ప్రసూనం!
నేనర్పించగలతుది నీరాజనం!!

ప్రాచీ కాలధౌతం

సహచరీ!
అటువైపు చూడు
ఒక్కమారు ప్రాగ్దిశకేసి
నామనోజ్ఞ భావనేత్రాలతో
ఈకమనీయ కల్పనా గవాక్షం నుంచి
ఒక్కమారు....

ధరణీ పత్ని ఒడిలో
గాఢ నిద్రాసక్త బాలభానునికి
గగనపతి మెలమెల్లగా
వైతాళిక గీతి నాలపిస్తున్నాడు.................

చలువ దుస్తుల నలంకరించుకొని
వినూత్న శోభనందించిన
శీతామయుఖుడు తన
వినీలా భ్రగమనాన్ని త్యజించి
ప్రయాణబడలికను తీరుకొనుటకై
పవళించ బోతున్నాడు
పశ్చిమాద్రి పడతి
ప్రీతితోపరచిన ప్రశాంతశయన వేదికపై............

విశుద్ధ జీవన సందేశాన్ని
విశ్వానికి పంచి పంచి
విశ్వాంతరాళాల్లో పరచి పరచి
తయయానం ముగిసి
కలువ భామల్ని కన్నీళ్ల కప్పగించి
కాల చంక్రమణ భారాన్ని
ప్రభాకర స్వామికి అప్పగిస్తూ
తాను మెల్లగా నిష్క్రమిస్తున్నాడు..............

అటు చూడు!

ప్రత్యూష పవన ప్రశాంతిలోంచి
నవనవ ప్రసూనాల పరిమళ్ళల్లోంచి
ప్రాణికోటి ఇప్పుడిపుడే
మౌనాన్ని విదిల్చుకుని
దినరాజు పిలుపు నాదుకొంటుంది...................

ప్రశాంత వదనంతో మేల్కొన్న
నిఖిలజగతి
నిర్గుణాత్మకు నివాళులర్పిస్తోంది............
మందమతి మానవునికంటే
ముందుగా తామే మేల్కొని
కల్హారం పంచుతోంది అందరికీ
అనన్య అవ్యయానంద సింధూరం
కాని కొందరి గుండెల్ని
ఈ విషా
రోదనల ప్రోది చేసి పిండుతోంది
అనంత విషాదార్ణవసందోహం....................

అటు వైపు చూడు!!

విధివిహిత ప్రయాణంలో
విసిగి వేసారిన బాటసారులు
మందమారుత పరిష్వంగంలో
మై మరచి ఎలా నిద్రిస్తున్నారో!
కుటిల జగతికి దూరంగా
కొద్ది క్షణాలైనా విశ్రాంతిగా

ఉదయాద్రి పరచిన ఉషోదయ కాంతి కిరణాలు
ప్రకృతి కాంతక పోలాలను కరుణా మృతంతో స్పృశించి
పరవశింపచేస్తున్నాయ్
సృష్టి ప్రతి అణువు
ఈ అనల్ప భావనా తరంగిణిలో
ఓ సుమధురవేణికగా
వినిపిస్తోంది కరుణా మృతగానంగా.........